క్లుప్తంగా

పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లతో సమీక్ష



సూపర్‌వైజర్లకు సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉత్తర నియోజక వర్గంలోని పోలింగ్ బూత్‌ల సూపర్‌వైజర్లు, సచివాలయ కన్వీనర్లు, ఇతర అధికారులతో డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ లిస్టులను ప్రజలు అందుబాటులో ఉంచాలన్నారు. తక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు జాబితాల్లో వివరాలు పరిశీలించుకోవాలని కోరారు.

భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం

సీతంపేట: నటరాజ నృత్య నికేతన్ నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో గురువారం శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవనంలో నృత్య విద్యార్థులచే గజ్జపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం ఉట్టిపడుతుందన్నారు. సాంస్కృతిక సంప్రదాయ కళగా విరాజిల్లుతున్న నృత్యాన్ని ఎవరైతే గురుముఖంగా భక్తిశ్రద్ధలతో నేర్చుకుంటారో వారు అత్యున్నతమైన కళాకారులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, వెంకటేష్, కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, కల్యాణి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రా పద్ధతిలో స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజారు సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవాలు



స్వామి పల్లకీని మోస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లోని పార్వతీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో 34వ వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, రత్నాకర్, వెంకటరావు, నాగరాజు, బద్రీ, గోవింద్, దాసు, లక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గదుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్ తదితరులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మూడుగుళ్ల వద్ద శ్రీకృష్ణ యువజన సేవా సంఘం నిర్మించిన కల్యాణ మండపంలో కొత్తగా గదులు నిర్మించడానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా బోరా ఈశ్వరరావు, సారిపిల్లి గంరాజు దంపతులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అర్చకులు శివగణేష్ శర్మ, ఇసరపు అప్పారావు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, బోర గోవింద్, పల్లా నూకరాజు, బొట్టా నాగభూషణం, సారిపిల్లి సంతోష్, వియ్యపు సంతోష్, సానబోయిన సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



24వ వార్డు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, డాక్టర్ మన్‌మోహన్



51వ వార్డు వైద్య శిబిరంలో కేస్ షీట్ అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతమ్మధార: ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్షలాది మంది రోగులకు ఉపయోగపడుతోందని చెప్పారు. 24వ వార్డు రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 25వ వార్డుకు సంబంధించి కార్పొరేటర్ గోవింద్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిని ఆయన ఆప్యాయంగా పలకరించి, మెడికల్ పత్రాలను పరిశీలించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలను ఆరోగ్య వంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లక్షల మందికి రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మన్‌మోహన్ మాట్లాడుతూ వివిధ రకాల వైద్య, రక్త పరీక్షలు చేసి 485 మందికి మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హరిజన వీధి 01 సచివాలయం ఉద్యోగులు, ఐసీడీఎస్, ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

550 మందికి వైద్య సేవలు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి అదే ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శిబిరాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వెంకటేష్ నేతృత్వంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, నేత్ర, సాధారణ వంటి వైద్యనిపుణులు అందుబాటులో ఉండి సుమారు 550 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించారు. సుమారు 1000కి పైగా టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 12 మందికి రిఫరల్ చేసినట్టు సిబ్బంది తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 24వ వార్డులో నూతన సామాజిక భవనాల ప్రారంభం



నక్కవానిపాలెంలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, సాడి పద్మారెడ్డి

సీతమ్మధార: నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 24వ వార్డులో నిర్మించిన రెండు కమ్యూనిటీ హాళ్లు, ఒక సచివాలయ భవనాన్ని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నక్కవానిపాలెంలో రూ.15.80 లక్షలతో సామాజిక భవనం, క్రాంతినగర్‌లో రూ.9.80 లక్షలతో శెట్టిబలిజ సామాజిక భవనం, పాత రేసపువానిపాలెంలో రూ.19.80 లక్షలతో సచివాలయ భవనం నిర్మించి ప్రారంభించినట్లు చెప్పారు. ఉత్తర నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. 2024లో మనమంతా వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని కె.కె.రాజు కోరారు. సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షులు కర్రి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల భాస్కరరెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దల్లి గురుమూర్తి, సీతాకుమారి, లోకేష్‌రెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, మధు, రేసపువానిపాలెం గ్రామ ప్రెసిడెంట్ బేరి గురునాథ్‌రెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, రేసపు కృష్ణారెడ్డి, వినయ్, బాబు, గోవింద్, పద్మ, రాధ, శాంతి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని అనసూయకు సత్కారం



నిష్టల అనసూయను సత్కరిస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు

సీతమ్మధార: విద్యా రంగంలో మూడున్నర దశాబ్దాలుగా విశేష సేవలందించి గురువారం పదవీ విరమణ చేసిన పీఅండ్‌టీ కాలనీ నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని నిష్టల అనసూయను పాఠశాలలో హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 27 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ పయనంలో మనసు అలసిపోయి, శరీరం లయ తప్పి పదవీ విరమణ తప్పనిసరైన ఓర్చుకొని మరో రెండేళ్ల పాటు విజయవంతంగా అనసూయ పనిచేశారని కొనియాడారు. ఆమె శేషజీవితం ఆనందంగా కొనసాగేలా దత్తాత్రేయుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



చుక్కా వెంకటేష్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జరిగింది. చుక్కా వెంకటేష్ అనే యువకుడు బీటెక్ చదువుకున్నాడు. మురళీనగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి మతిస్థిమితం లేకపోవడంతో గత నెల 25న ఆస్పత్రికి తీసుకెళ్తున్న క్రమంలో సూర్యానగర్ వద్ద నుంచి కంచరపాలెం వైపు వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా ఎక్కడికి వెళ్లాడో ఆచూకీ తెలియలేదు. యువకుడి తల్లి చుక్కా రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైందని ఫిర్యాదు అందింది. వివరాలిలా.. భిలాయ్‌లో ఐటీఐ చదువుతున్న సొండి రోహిణి అనే యువతి తల్లితో కలిసి జ్ఞానాపురంలో ఉంటున్న తన మేనమామ ఇంటికి ఇటీవల వచ్చింది. గత నెల 27న డాబా మీద దుస్తులు ఆరవేయడానికి వెళ్లిన రోహిణి ఎంతసేపటికి కిందికి రాలేదు. కుటుంబ సభ్యులు మేడ మీదకు వెళ్లి చూసేసరికి యువతి అక్కడ కనపడలేదు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం రాత్రి తల్లి సొండి జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ జయరావ్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి మైదానంలో గురువారం విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో నూతన అపోస్తోలిక్ పాలనాధికారి విశాఖ పీఠాధిపతిగా రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పొలిమేర జయరావ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం వీధుల్లో మేళతాళాలతో అతిథులను వేడుకగా ఊరేగించారు. అనంతరం డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు కృతజ్ఞత పూజాబలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నల్గొండ బిషప్ రెవరెండ్ ఫాదర్ కరణం ధమన్‌కుమార్, ఫాదర్లు మల్లెల జోజి, జొన్నాడ జాన్‌ప్రకాష్, బాలశౌరీ, చిటికెల రాజకుమార్, ఆర్జీ ప్రకాష్, జోసెఫ్ ప్రభాకర్, సిస్టర్లు శాండ్రిస్, రోస్ జోస్ దివ్యబలి పూజలు చేశారు. 41వ వార్డు కార్పొరేటర్ కోడిగడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగడ్ల శ్రీధర్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌కు వీడ్కోలు పలికి, నూతన బిషప్ జయరావ్‌కు స్వాగత పుష్పాలతో అభినందించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. ఓమ్ని హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 120 మంది భక్తులు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై హాస్పిటల్ సిబ్బంది వివరించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది గౌరునాయుడు, చంటి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

- ధ్యాన మందిర ప్రాంగణంలో భక్తులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించారు. ఎలైట్ డయాగ్నోస్టిక్స్ ప్రతినిధి డాక్టర్ త్రిపుర కుటుంబ సభ్యులు భక్తులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. 27 ఏళ్లుగా ఆలయ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ధ్యాన మందిర కమిటీ సభ్యులు తెలిపారు.

స్వామి ఆశీస్సుల కోసం..



పరీక్షలకు సిద్ధమంటున్న ఇంటర్ విద్యార్థినులు



షిర్డీసాయి పాదాల వద్ద హాల్ టికెట్లు ఉంచి పూజలు చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు

సీతమ్మధార: ఈ నెల 1 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్ కళాశాల విద్యార్థినులు సిద్ధమయ్యారు. శుక్రవారం నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలకు ఎంపీసీ గ్రూప్ నుంచి 15 మంది, బైపీసీ నుంచి 11 మంది హాజరవుతున్నారు. 2వ తేదీ నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలకు ఎంపీసీ గ్రూప్ నుంచి 11 మంది, బైపీసీ నుంచి ఏడుగురు విద్యార్థినులు హాజరవుతారని తెలుగు టీచర్ వరలక్ష్మి తెలిపారు. మొత్తం 44 మంది విద్యార్థినులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని విద్యార్థినులు ధీమా వ్యక్తం చేశారు.

షిర్డీసాయిని దర్శించుకున్న ఇంటర్ విద్యార్థులు

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థినులు ప్రత్యేక పూజలు చేశారు. బాబా పాదాల వద్ద హాల్ టికెట్లు ఉంచి మంచి ఉత్తీర్ణత సాధించాలని మొక్కుకున్నారు. ఇంటర్ పరీక్షల్లో విజయం సాధించాలని అర్చకుడు వంశీ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.

వైభవోపేతంగా పార్వతీశ్వరుల కల్యాణం



ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట: సీతంపేటలో కొలువైన పార్వతీశ్వరస్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈవో రమాభాయి పర్యవేక్షణలో శైవాగమ పండితులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో వేద మంత్రాలు, మేళతాళాల మధ్య కల్యాణం కనుల పండువగా సాగింది. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలదండలతో చూడ ముచ్చటగా అలంకరించారు. సుమూహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పణ, ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో స్వామి వారి సారె ఊరేగింపు అనంతరం ఏకాంత సేవ జరుగుతాయని అర్చకులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

స్ఫూర్తిదాయకమైన సేవలకు సత్కారం



పారిశుధ్య కార్మికురాలు విజయలక్ష్మిని సత్కరిస్తున్న నాగభూషణం, శివ తదితరులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో 37 ఏళ్లుగా సేవలందించి పదవీ విరమణ చేసిన పారిశుధ్య కార్మికురాలు ధనాల విజయలక్ష్మిని గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రామకృష్ణానగర్‌లోని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సూపర్‌వైజర్ నాగభూషణం మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు విజయలక్ష్మి ప్రజలకు సేవలందించారన్నారు. పని విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా మంచి పేరు సంపాదించారని కొనియాడారు. ఆమె సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. అనంతరం విజయలక్ష్మిని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విహారిక, జోనల్ సెక్రటరీ దంతులూరి శివ, అయినాడ వెంటకరమణ, ఎం.రాజు, సెక్రటరీ వరప్రసాద్ నాయుడు, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



లలితానగర్‌లో మరమ్మతులు చేపట్టిన యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో లలితా గుడికి వెళ్లే మార్గంలో వారం రోజులుగా లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి లీకును అరికట్టారు. యూజీడీ లీకుతో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో పాదచారులు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను 'యూజీడీ లీకుతో అవస్థలు' అనే శీర్షికన గత నెల 28న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ యూజీడీ విభాగం ఏఈ రవికుమార్ స్పందించారు. సిబ్బంది తక్షణం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.